క్లుప్తంగా

నేడు ఐదు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం

వీరఘట్టం: మండలంలోని కంబర, చిట్టపులివలస, కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ పంచాయతీల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు ప్రచార కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హడలెత్తిస్తున్న వడగాలులు



నిరానుష్యంగా పాలకొండ-పార్వతీపురం వయా రాయగడ అంతర్‌రాష్ట్ర రహదారి

పాలకొండ రూరల్: గడిచిన రెండు రోజులుగా మండల వ్యాప్తంగా ఎండల తీవ్రత అధికమైంది. శుక్రవారం 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వడగాలులు తీవ్రమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ లఘు సమాచారాన్ని సెల్‌ఫోన్లకు పంపిస్తూ జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించడంతో వృద్ధులు, పిల్లలు ఇళ్లకు పరిమితమయ్యారు. నిత్యం రద్దీగా ఉండే శ్రీకాకుళం, పాలకొండ, సీతంపేట, విశాఖ, వీరఘట్టం రహదారులు మధ్యాహ్నం 1గంట సమయంలో నిర్మానుష్యంగా మారాయి.

కొనసాగుతున్న పోలీసుల కవాతు



వీరఘట్టంలో కవాతు చేస్తున్న సాయిధ బలగాలు

వీరఘట్టం: వచ్చేనెల 13న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర సాయుధ బలగాలు కొద్ది రోజులుగా మండలవ్యాప్తంగా కవాతు చేస్తున్నాయి. ఈ మేరకు ఎస్సై ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు వీరఘట్టం మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లో శుక్రవారం కవాతు చేసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించాయి.

ఎన్నికలపై అవగాహన



నయా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నఎస్‌ఐ నీలకంఠం

కొమరాడ: వచ్చేనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో శాంతియుతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ నీలకంఠం సూచించారు. మండలంలోని నయా పోలింగ్ కేంద్రం వద్ద ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఓటు విలువను తెలియజేశారు.

నేడు గుమ్మలక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. ఈ మేరకు తాటిశీల గ్రామంలో గ్రామ దేవతకు పూజలు నిర్వహించిన అనంతరం చెముడుగూడ, కుక్కిడి, ఇరిడి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా రామాలయం ప్రథమ వార్షికోత్సవం

సీతానగరం: మండలంలోని చిన్నారాయుడుపేటలో సూరంపేట మాజీ సర్పంచ్ సీహెచ్ సాంబందొర, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రామమందిరం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు కమిటీ సభ్యులు నాగరాజు, సాంబందొర మాట్లాడుతూ ఆలయ అర్చకుడు మైలారభట్ల ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషిఫలితంగా చిన్నారాయుడుపేటలో రామమందిరం నిర్మించడానికి సమరసత సేవాసమితి, టీటీడీ ప్రచార కమిటీ ద్వారా, ప్రజలు సమకూర్చిన నిధులతో 2023 ఏప్రిల్ 5న ఆలయ ప్రతిష్ట నిర్వహించినట్లు చెప్పారు. రామాలయం నిర్మాణం పూర్తయి ఏడాది కావడంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో ప్రథమ వార్షికోత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించి సూరంపేట పంచాయతీలో ఉన్న మరిపివలస, సూరంపేట, చిన్నారాయుడుపేట, పొరుగు గ్రామాల ప్రజలకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.

ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి

- ఎన్నికలవేళ టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దు..
- వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయండి
- కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణి పిలుపు
- ఆత్మీయ నేస్తానికి స్వాగతం పలికిన గిరిజనులు



కురుపాం మండలం బియ్యాలవలస గ్రామంలో ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: ఎన్నికల వేళ కనిపించే టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను ఓటుతో మరోసారి ఆశీర్వదించాలని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. కురుపాం మండలంలోని బియ్యాలవలస, సింగుపురం, గొందిలోవకాలనీ, గోత్లవలస, కిచ్చాడ, వెంకటాపురం, రామకృష్ణాపురం, పట్టాయిదొరవలస గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఆమెకు స్థానికులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి విజయతిలకం దిద్దారు. ఈ సందర్భంగా ఆమె ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఎదురుగా రెండు సార్లు బటన్ నొక్కి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణిను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఐదేళ్లుగా వలంటీర్లు నిష్కల్మషంగా అందిస్తున్న సేవలను చంద్రబాబు అండ్‌కో అడ్డుకున్నారన్నారు. దీనివల్ల పింఛన్‌దారులకు ఇబ్బందులు ఎదురయ్యాయని, దివ్యాంగులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. చంద్రబాబు తీరు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 31 మంది వృద్ధులు మృత్యువాత పడ్డారన్నారు. ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అడుగడుగునా అడ్డుకోవడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కుట్రలు పన్నుతోందన్నారు. వీరికి మరోసారి ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. సింగుపురం గ్రామానికి చెందిన పగడాలమ్మ అనే గిరిజన మహిళ అడవిలో జీడిపిక్కలు సేకరించి ఇంటికి వస్తుండగా ఎమ్మెల్యే పలకరించారు. జీడి పంట దిగుబడి, మార్కెట్లో ధర వివరాలను, సంక్షేమ పథకాల అందిన తీరును తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, గుమ్మిడిగూడ సర్పంచ్ శెట్టి సురేష్, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందిరాకుమారి, కొత్తకోట సురేష్, గవర విజయ్, ఎంపీటీసీ సభ్యులు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, విద్యారాణి, గౌడు సంతోషిరాణి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మాజీ ఎంపీటీసీ చిన్నారావు, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.



సింగుపురం గ్రామంలో జీడీపిక్కలు సేకరించి వస్తున్న పగడాలమ్మతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కూటమిని కుప్పకూలుద్దాం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ప్రజలను మభ్యపెట్టేందుకు ఒక్కటైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని కుప్పకూలుద్దామని, జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేద్దామని వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పిలుపు నిచ్చారు. ఈ మేరకు సీతంపేట మండలంలోని దోనుబాయి, రూపాయి, పుబ్బాడ, పెద్దపల్లంకి, కె.వీరఘట్టం, పల్లంకివలస, దిగువపల్లంకి, గుజ్జి, పుబ్బాడగూడ, దాసుగుమ్మడ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతిపక్ష పార్టీలు పన్నుతున్న కుట్రలకు లొంగకుండా ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మీకు చేసిన మేలు ఏంటో మీరే ఆలోచించుకోవాలని హితవు పలికారు. ఎలాగైనా అధికారంలోకి రావడానికి తప్పుడు హామీలతో కూటమి ప్రయత్నిస్తోందని విమర్శించారు. జగనన్న ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థతో సేవలు అందిస్తున్నామని, వలంటీర్ల ద్వారా ప్రజలకు మేలు కలగడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ అధినేత చంద్రబాబు ఆయన అనుచరులు పలువురితో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వారి సేవలను నిలిపివేయించారన్నారు. రాష్ట్రంలో అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగుల గోడు చంద్రబాబుకు తగలక తప్పదని స్పష్టం చేశారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి పింఛన్‌లు అందిస్తారని చెప్పారు. 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా స్వచ్ఛమైన సేవలందించి, విద్య, వైద్యం, రైతు, ప్రజాసంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.



రూపాయి గ్రామంలో ఎమ్మెల్యే వెంటే మేం ఉంటాం అంటున్న మహిళలు

మీ వెనుకే నడుస్తాం

మేమంతా మీ వెనుకే నడుస్తాం. మిమ్మల్ని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తాం. జగనన్నను ముఖ్యమంత్రిగా చేస్తామంటూ గిరిజనులు ఎమ్మెల్యే కళావతికి హామీ ఇచ్చారు. మా గ్రామాలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించి అన్ని విధాలా చేదోడు, వాదోడుగా ఉన్న మిమ్మల్ని వదులుకోలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రరావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హిమరక మోహన్‌రావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.మహేష్, సాయికుమార్, షోడంగ, ఎస్.ఆదినారాయణ, ఎన్.కాంతారావు, ఎస్.సోమయ్య, అబ్బాస్, కృష్ణ, గంగారావు, సర్పంచ్‌లు, కె.వెంకునాయుడు, ఎ.కళావతి, ఎం.సుమలత, లక్ష్మి, పద్మ, తిరుపతిరావు, చెంచమ్మ, సువార్త, ఎంపీటీసీలు హరిబాబు, గణేష్, లక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దోనుబాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

కనుల పండువగా కోటదుర్గ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

వీరఘట్టం: స్థానిక శ్రీకోటదుర్గ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు.యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మ యాజీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్ కృచ్ఛత్రయం, పంచగవ్య ఆరాధన, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణ ప్రదానం, యాగశాల ప్రవేశ ద్వారపూజ, ధ్వజస్తంభ పతాకావిష్కరణ, మంటపారాధనతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గాదేవి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున వచ్చి దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీకోటదుర్గ తల్లి

ఇసుక లారీలను అడ్డుకున్న అధికారులు

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలో ఇసుక తవ్వకాలపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు శుక్రవారం నాగావళి నది వద్దకు చేరుకున్నారు. నదిలో ఉన్న జేసీబీ, ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన లారీని సీజ్ చేశారు. మైనింగ్ అధికారులు సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.



ఇసుక ర్యాంపు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

జగజ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులు



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘం నాయకులు




వీరఘట్టంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జైభీమ్ సంఘం సభ్యులు

వీరఘట్టం: కేవీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు వీరఘట్టంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సీబీఎం వీధిలో గల బాబుజగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులవివక్షపై దళితులు ఐక్యంగా ఉద్యమించాలని జైభీమ్ సంఘం నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.


కస్పావీధిలో..

పాలకొండ రూరల్: స్థానిక కస్పా వీధిలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాసేవకుడు జగ్జీవన్ రామ్ మహోన్నత వ్యక్తి అని, లోక్‌సభకు వరుసగా ఎనిమిది సార్లు ఎన్నికై, ఉపప్రధానిగా దేశానికి సేవలందించిన ఘనత ఆయనదేనని కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో దళిత నాయకులు యందవ మరియదాసు, బోగి దాసు, శ్రీదేవి, పారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



కుక్కిడిలో పెన్షన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్



నడవలేని స్థితిలో ఉన్న వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుకల పంపిణీ 97.57 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ తెలిపారు. మండలంలోని కుక్కిడి, కేదారిపురం గ్రామ సచివాలయాల పరిధిలో పెన్షన్ల పంపిణీని ఆయన శుక్రవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 6,771 మంది పింఛన్‌దారులు ఉండగా, 6,552 మందికి పింఛన్ డబ్బులు అందజేశామన్నారు. పింఛన్ల పంపిణీలో జిల్లా స్థాయిలో గుమ్మలక్ష్మీపురం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈనెల 6వ తేదీలోగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తున్నామన్నారు

వీరఘట్టంలో 95 శాతం పింఛన్ల పంపిణీ

వీరఘట్టం: మండలంలో పింఛన్ల పంపిణీ శరవేగంగా చేపడుతున్నామని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి 95 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు. మంచంపై ఉన్న, నడవలేని వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసినట్లుతెలిపారు. మండలంలో 10,028 మంది పింఛన్‌దారులు ఉండగా ఇంతవరకు 9526 మందికి అందజేశామని వివరించారు. మిగిలిన వారు అందుబాటులో లేకపోవడంతో ఇవ్వలేదన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని 13 గ్రామ సచివాలయ పరిధిలో 86 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఈఓపీఆర్‌డీ ఎల్. గోపాలరావు శుక్రవారం తెలిపారు. సచివాలయ పరిధిలో 8,422 మంది పింఛన్ దారుల్లో 7,600 మందికి అందజేసినట్టు చెప్పారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచం మీద నుంచి కదలలేని వారికి ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తున్నారన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లకు ఆ శాఖ ఏఈ బి.శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించారు. పాడైన తీగెలను తొలగించి కొత్తవి వేశారు. ఈదురు గాలుల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పనులు చేసినట్టు ఏఈ తెలిపారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



దబ్బివీధిలో రామమందిరం వద్ద వేస్తున్న ముహూర్తపు రాట

సాలూరు: శ్రీరామనవమి వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాటలను శుక్రవారం వేశారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని దబ్బివీధి, గాడివీధిలలో గల రామాలయాల వద్ద ముహూర్తపు రాటలను శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి వేశారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆధ్యాత్మికతతో కూడిన వాతావరణం నెలకొంది.

రేషన్ కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకూడదు

పార్వతీపురంటౌన్: రేషన్ కార్డుదారుల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా వారికి నిత్యావసరాలు అందించాలని తహసీల్దార్ కె. ఆనందరావు ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని 21వ వార్డు లింగంవీధి రేషన్ డిపో పరిధి ఎండీయూ వాహనాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ కోసం వచ్చిన కార్డుదారులతో స్వయంగా మాట్లాడారు. వాహనంలో ఉన్న స్టాకుకు మెషీన్‌లో నమోదైన స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. ఎండీయూ వాహనం ఆపరేటర్‌తో మాట్లాడుతూ కచ్చితంగా సమయ పాలన పాటించాలని, కార్డుదారుల ఇంటి దగ్గర వాహనం ఆపి సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ పంపిణీ విషయంలో కార్డుదారుల నుంచి ఏవిధమైన ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని స్పష్టం చేశారు. రేషన్ పంపిణీకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున వలంటీర్లు సేవలు అందించరాదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

పార్వతీపురం టౌన్: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వాహనాల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రాష్ట్ర రహదారిపై వైకేఎంకాలనీ, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ జంక్షన్‌లలో వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికార సిబ్బంది ఆర్ఐ నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనుమతులు లేకుండా వాహనాల్లో నగదు తరలించరాదని, నిషేధిత సరుకులు తరలించడం నేరమన్నారు. వాహనాల తనిఖీల్లో నగదు, నిషేధిత సరుకులు పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

పాలకొండ రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని వర్గాల వారు సహకరించాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని అవలంగి, అంపిలి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు లోబడి రాజకీయ పక్షాలతో పాటు ప్రజలు ఉండాలని స్పష్టం చేశారు. ఇప్పటికే మండల పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ బూత్‌లపై దృష్టిసారించామని, గత ఎన్నికల నేపథ్యంలో కేసుల్లో ఇరుక్కున్నవారిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయ ఘర్షణలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆయన వెంట ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ తదితరులున్నారు.



అంపిలిలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు వివరిస్తున్న సీఐ

పింఛన్‌ల పంపిణీపై టీడీపీ కుట్ర

పాలకొండ: ప్రభుత్వం అందించే సామాజిక పింఛనల్ల పంపిణీపై టీడీపీ నీచమైన కుట్ర చేసిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కణపాక సూర్యప్రకాశ్ రావు ధ్వజమెత్తారు. పింఛన్‌ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడం ద్వారా అవ్వాతాతల ఉసురు పోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహనరెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ఉండడంతో పింఛన్‌లు అందించడం సాధ్యమైందన్నారు. చంద్రబాబునాయుడు మొదటి నుంచి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థపై ద్వేషంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి జరుగుతుంటే సహించలేని టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సంక్షేమ పాలన అందించిన జగన్‌మోహనరెడ్డికి ప్రతి ఒక్కరు అండగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలోను ప్రభుత్వానికి అపూర్వ ఆదరణ లభిస్తోందని, దీనిని ప్రతిపక్ష నాయకులు తట్టుకోలేక పోతున్నారన్నారు. తామంతా సమన్వయంతో పనిచేసి మళ్లీ జగన్‌మోహనరెడ్డిని సీఎంగా చేసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న కణపాక సూర్యప్రకాశ్ రావు

పుష్పశ్రీవాణి చొరవతో.. మార్గం సుగమం

కురుపాం: నాటి టీడీపీ పాలనలో గిరిజన గ్రామాల రోడ్లు అధ్వానం. రాళ్ల దారులే దిక్కు. ఎన్నిసార్లు విన్నవించినా నాయకులు పట్టించుకునేవారు కాదు. నిత్యం 'దారి'కష్టాలు వెంటాడేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రణాళికాబద్ధంగా, ప్రాధాన్యతాపరంగా మన్యంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టింది. రాకపోకల కష్టాలను దూరం చేస్తోంది. గుమ్మలక్ష్మీపురం మండలంలోని నోండ్రుకూడ గ్రామస్తుల రోడ్డు సమస్యపై ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి స్పందించారు. రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం అటువైపుగా వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు తీరడంతో సంతోషపడుతున్నారు. అటవీ ఉత్పత్తుల తరలింపునకు మార్గం సుగమమైందని చెబుతున్నారు. విద్య, వైద్య సౌకర్యాలు చేరువకావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న నోండ్రుకూన రోడ్డు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటి ఖర్చుతో నిర్మించిన బీటీ రోడ్డు

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

పాలకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈవీఎంల భద్రపరిచే గదులను తహసీల్దార్ వరహాలు శుక్రవారం పరిశీలించారు. గదుల వద్ద భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. గదులకు చుట్టూ ప్లైవుడ్‌తో కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈవీఎంల భద్రత కోసం స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేసి పక్కాగా ఏర్పాట్లు చేపట్టి ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు.